క్లుప్తంగా

మహిళలపై పెరిగిన అత్యాచారాలు


గోపాలపురంలో సీపీఐ ఎంఎల్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సుందర్రావు

గోపాలపురం: రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని సీపీఐ ఎంఎల్ ప్రజా పోరాట సమితి ప్రధాన కార్యదర్శి కలింపూడి సుందర్రావు అన్నారు. స్థానిక సీపీఐ ఎంఎల్ కార్యాలయం వద్ద గురువారం స్త్రీ శక్తి మహిళా సంఘం నాయకురాలు షేక్ మహ్మద్ షఫిక అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సుందర్రావు మాట్లాడుతూ మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలను తీవ్రంగా ఖండిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కామన సత్యనారాయణ, రేవూరి వెంకన్న, ఎస్.వెంకటేశ్వరరావు సీపీఐ ఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

గోపాలపురం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి, జూనియర్ ఇంటర్లో ప్రవేశాలకు మార్చి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6న గోపాలపురం గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్షలు ఉంటుందని తెలిపారు. నాలుగు, పదో తరగతి చదివే విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు హాజరు కావాలని, వారికి వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం


ఉండ్రాజవరంలో గోకర్ణేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న సేవా సమితి సభ్యులు

ఉండ్రాజవరం: మహా శివరాత్రి సందర్భంగా ఉండ్రాజవరంలో బాలాత్రిపుర సుందరీ, శ్రీగోకర్ణేశ్వర స్వామివారికి బుధవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర సరస్వతి స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని 11 రకాల ద్రవ్యాలతో జరిపారు. అనంతరం బాలా త్రిపుర సుందరీ దేవికి లలితా సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అక్కెళ్ల శ్రీనివాసరావు, దోనేపూడి సుధాకర్, ఇ.సత్యకృష్ణ, కూచిభోట్ల సత్యనారాయణ, దోనూపైడి శ్రీరామ్‌పవన్, బి.సత్యకుమార్, బాలాజీ, మల్లాది రమణ పూజలు జరిపించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు రూరల్: కోరుమామిడి, ఐసివిరెడ్డిపేట సబ్ స్టేషన్ల పరిధిలోని కోరుమామిడి, సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదు. ఈ విషయాన్ని గురువారం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులంతా సహకరించాలన్నారు.

ఉండ్రాజవరం: చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం వడ్లూరు, పసలపూడి, దమ్మెన్ను గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

కొవ్వూరు: వాడపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే వాడపల్లి, తొగుమ్మి, వేములూరు, మద్దూరు, సీతంపేట, మద్దూరు లంక గ్రామాల్లో వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.


కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ తీరును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు


గోపాలపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లు


దేవరపల్లిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న పట్టభద్రులు


పెరవలిలో ఎమ్మెల్సీ పోలింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ అచ్యుత కుమారి

పోలింగ్ ప్రశాంతం

- ముగిసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు
- కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు


తాళ్లపూడిలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిలబడిన ఓటర్లు

దేవరపల్లి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం దేవరపల్లిలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగిన ఈ పోలింగ్‌లో 62.74 శాతం ఓట్లు పోలయ్యాయి. మండలంలో మొత్తం 2,166 మంది ఓటర్లు ఉండగా, 1,359 మంది ఓటు వేశారు. వీరిలో పురుషులు 848 మంది, స్త్రీలు 511 మంది ఉన్నారు. పురుషులు 478 మంది, స్త్రీలు 329 మంది ఓటు వేయలేదు. దేవరపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో 2, జెడ్పీ హైస్కూల్లో 1 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ సందర్శించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సుజాత దంపతులు మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఓటు వేశారు. ఉదయం 10 గంటలకు 7.7 శాతం, 11 గంటలకు 17.04, మధ్యాహ్నం 12 గంటలకు 24.28, ఒంటిగంటకు 36.01, 2 గంటలకు 45.98, 3 గంటలకు 55.17, సాయంత్రం 4 గంటలకు 62.74 శాతం చొప్పున ఓట్లు పోలైనట్లు మండల ఎలక్టోరల్ అధికారి, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి నాయకుల సందడి ఎక్కువగా కనిపించింది. ఇతర గ్రామాల నుంచి ఓటర్లను ఆటోలు, కార్లలో పోలింగ్ కేంద్రాలకు తీసుకు వచ్చారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి పట్టభద్రులు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని అదనపు ఎస్పీ సుబ్బరాజు తెలిపారు. జిల్లాలో ఐదు జోన్లు ఏర్పాటు చేసి, ఇన్చార్జిలను నియమించామన్నారు. నలుగురు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఆర్మ్డ్ రిజర్వ్డ్ సిబ్బందిని నియమించామని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. బ్యాలెట్ బాక్సులను ఏలూరులో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు తరలిస్తామని చెప్పారు. అదనపు ఎస్పీ వెంట దేవరపల్లి సీఐ బీఎన్ నాయక్, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం ఉన్నారు.

మండలంలో 65 శాతం పోలింగ్

తాళ్లపూడి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి పోలింగ్ మందకోడిగా సాగింది. మండలంలో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 1935 మంది ఓటర్లకు గాను 1260 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 802 మంది, మహిళలు 458 మంది ఉన్నారు. మొత్తం 65.12 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ మోహన భారతి తెలిపారు. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆర్డీవో రాణి సుస్మిత పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బ్యాలెట్ బాక్స్‌లను రాజమహేంద్రవరం తరలించారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. అధికారులు, నాయకులతో మాట్లాడి వెళ్లారు. పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులు హడావుడి చేశారు.

నల్లజర్లలో 74.36 శాతం పోలింగ్

నల్లజర్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నల్లజర్లలో 74.36 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నంబరు 285వ నంబరు పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గోపాలపురంలో 67.19 శాతం

గోపాలపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గోపాలపురం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత, జేబీ పాఠశాలల్లో నిర్వహించిన పోలింగ్‌లో 1,777 మంది ఓటర్లకు గానూ 1,194 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 67.19 శాతం నమోదైంది. ఆయా పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు పరిశీలించారు. హుకుంపేట గ్రామానికి చెందిన 86 ఏళ్ల హోతా శాంతకుమారి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తహసీల్దార్ అజయ్‌బాబు తెలిపారు.

పెరవలి: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 1,926 మంది ఓటర్లు ఉండగా, 73.16 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ అచ్యుత కుమారి తెలిపారు.

చాగల్లు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరిగింది. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 291వ నంబర్ పోలింగ్ బూత్ వద్ద పట్టభద్రులు బారులు తీరారు. నాలుగు బూత్‌లలో 2,618 మందికి గానూ 1,744 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 66.62 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, కొవ్వూరు ఆర్డీవో రాణిసుష్మిత తనిఖీ చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చాగల్లు ఎస్సై కె.నరేంద్ర పర్యవేక్షణలో ఆయా కేంద్రాలు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిడదవోలు: నియోజకవర్గంలో మొత్తం 8,529 మంది ఓటర్లు ఉండగా 5,891 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 69 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిడదవోలు పట్టణం, రూరల్ మండలంలో 3,952 మంది ఓటర్లు ఉండగా 2,641 మంది ఓట్లు పోలయ్యాయి. పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. నిడదవోలు సీఐ జీవీజీ తిలక్, పట్టణ ఎస్సై పరమహంస, నిడదవోలు తహసీల్దార్ నాయరాజునాయక్‌లు భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఉండ్రాజవరం: మండలంలో మొత్తం 72.92 శాతం పోలింగ్ నమోదైంది. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల–2లో ఏర్పాటు చేసిన 4 పోలింగ్ కేంద్రాల్లో 2,651 మంది ఓటర్లకు గాను 1,933 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్సై గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.


నిడదవోలులో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

డివిజన్‌లో 68.60 శాతం పోలింగ్


కొవ్వూరులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు

కొవ్వూరు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో 16,962 మంది ఓటర్లు (68.60 శాతం) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. పట్టణంలో పోలింగ్ తీరును జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు గురువారం పరిశీలించారు. క్యూలైన్‌లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సాయంత్రం నాలుగు గంటల వరకూ క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లకు ఓటుహక్కు కల్పించారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆయన వెంట ఉన్నారు. డివిజన్‌లో తాళ్లపూడి మండలంలో అత్యల్పంగా 65.12 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. నల్లజర్లలో గరిష్ఠంగా 74.36 శాతం పోలింగ్ నమోదైంది. పెరవలిలో 73.16, నిడదవోలులో 66.83 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. కొవ్వూరులో 66.97 శాతం పోలింగ్ నమోదైంది. డివిజన్‌లో 24,776 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుష ఓటర్లు 14,487, మహిళలు 10,239 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 10,097 మంది, మహిళలు 6,865 మంది మొత్తం 16,963 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో కనిష్ఠంగా 68.60 శాతం పోలింగ్ నమోదు కాగా, గోపాలపురం నియోజకవర్గంలో 65.62 శాతం, నిడదవోలు నియోజక వర్గంలో 69 శాతం చొప్పున పోలింగ్ నమోదైనట్టు ఆర్డీవో రాణి సుస్మిత వివరించారు.

దర్జా కోల్పోతున్న దర్జీలు

- రెడీమేడ్ వస్త్రాలతో తగ్గిన పనులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.10 వేల ఆర్థిక సాయం
- రూపాయి కూడా ఇవ్వని కూటమి ప్రభుత్వం
- నేడు టైలర్స్ డే


అనంతపల్లిలో టైలరింగ్ షాపు

నల్లజర్ల: రెండు దశాబ్దాలుగా రెడీమేడ్ దుస్తుల హవా మొదలైంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా రెడీమేడ్ షాపులే కనిపిస్తున్నాయి. పుట్టిన బిడ్డ నుంచి సీనియర్ సిటిజన్ వరకూ రెడీమేడ్ దుస్తులు అందుబాటులో ఉంటున్నాయి. దీంతో టైలర్లకు ఉపాధి కరవవుతోంది. రెడీమేడ్ నచ్చని కొంత మంది సీనియర్ సిటిజన్లు మాత్రమే దర్జీలకు పని కల్పిస్తున్నారు. సమాజంలో వ్యక్తి హోదాను సూచించేవి వారు ధరించే వస్త్రాలే. ఆ వస్త్రాలను తగిన ఆకృతిలో మలిచే కళాకారుడే దర్జీ. రెడీమేడ్ వస్త్రాల హవాతో ఎక్కువ మంది దర్జీలు ఆర్థికంగా చితికిపోతున్నారు. కుట్టు మెషీన్ రూపొందించిన విలియమ్స్ హో పుట్టిన రోజైన ఫిబ్రవరి 28న ఏటా టైలర్స్‌డేగా నిర్వహిస్తున్నారు.

2,800 మంది దర్జీలు

గోపాలపురం నియోజకవర్గంలో దాదాపు 2,800 మందికి పైగా దర్జీలున్నారు. వంశపారంపర్యంగా ఈ వృత్తిలో రాణిస్తున్నవారు కొందరైతే.. తప్పనిసరి పరిస్థితుల్లో మరో పని రాక టైలర్లుగానే కాలం వెళ్లబుచ్చుతున్న వారు మరికొందరు. మారిన పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న టైలర్లను ఆదుకునేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేది. ఇది వారికి కొంత వెసులుబాటునిచ్చేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నయా పైసా సాయం లేకపోవడంతో దర్జీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరుపేద దర్జీలందరికీ ఇళ్ల స్థలాలు, పింఛన్లు ఇవ్వాలంటూ ఏళ్ల తరబడి వారు చేస్తున్న అభ్యర్థన అరణ్య రోదనగానే మిగిలింది. తమకు ప్రత్యేక ప్యాకేజీ రూపొందించి, పావలా వడ్డీకే రుణాలిచ్చి, ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని దర్జీలు కోరుతున్నారు. అలాగే, భవన నిర్మాణ, కల్లుగీత కార్మికుల మాదిరిగా తమకు కూడా గుర్తింపు కార్డులిచ్చి, ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తదేక దృష్టితో కుట్టు పని చేయడం, ఎక్కువ సమయం కూర్చుని ఉండటంతో కంటి, నడుం నొప్పి వంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, మత్స్య, చేనేత, గీత కార్మికుల మాదిరిగా 50 ఏళ్లు నిండిన టైలర్లందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



దర్జీలను ప్రభుత్వమే ఆదుకోవాలి. 40 ఏళ్ల నుంచి పని చేస్తున్నా చేతుల వణుకు, కళ్లు కనిపించకపోవడం తప్ప సాధించిందేమి లేదు. దర్జీలపై రెడీమేడ్ వస్త్రాల ప్రభావం బాగా పడింది. పండగల సమయంలోనే పని ఉంటుంది. ఇతర వృత్తుల మాదిరిగానే దర్జీలకు కూడా ప్రభుత్వం రుణాలు, పింఛన్లు ఇవ్వాలి.

– వంటిట్టు మెహర్‌బాబా, దర్జీ, అనంతపల్లి

ధరలు పెరిగిపోయాయి



గతంతో పోలిస్తే మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో గిట్టుబాటు కావడం లేదు. 25 ఏళ్లుగా ఇదే వృత్తిలో ఉన్నా కొద్దిపాటి ఆస్తి కూడా సంపాదించుకోలేకపోయాను. ఈ వృత్తిలోకి వచ్చే వారి సంఖ్య తగ్గిపోతోంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– షేక్ నాగూర్, దర్జీల సంఘం అధ్యక్షుడు, అనంతపల్లి

ఈ రంగాన్ని కాపాడాలి



టైలర్లకు ఆదరణ తగ్గుతోంది. కొత్తవారు ఈ రంగంలోకి రావడం లేదు. ఈ వృత్తినే నమ్ముకున్న వారికి రాయితీలు ఇచ్చి, టైలరింగ్‌ను బతికించాలి.

– రావిపాటి జగదీష్, దర్జీల సంఘ అధ్యక్షుడు, పోతవరం

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత


కొవ్వూరులో వాత్యల్స వృద్ధాశ్రమానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న దృశ్యం

కొవ్వూరు: పట్టణంలో వాత్సల్య వృద్ధాశ్రమానికి నెల రోజుల పాటు సరిపడే నిత్యావసర సరకులను ఏబీఎస్ పూర్వపు ప్రిన్సిపల్ ఎన్వీ సుబ్బారావు అందజేశారు. గురువారం అవంతీఫీడ్స్, ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాల చైర్మన్ డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామ్మోహనరావు, వైస్ ప్రిన్సిపల్ వై.రమేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సీవీ రామన్ చిత్రం


సీవీ రామన్ చిత్రంతో తపస్విరెడ్డి

నిడదవోలు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నారాయణ విద్య సంస్థల్లో 8వ తరగతి చదువుతున్న కుంచాల తపస్విరెడ్డి గురువారం తయారు చేసిన నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రం ఆకట్టుకుంటుంది. బియ్యం, సబ్జా గింజలు, మిల్లెట్స్ ఉపయోగించి గంటన్నర శ్రమించి ఈ చిత్రాన్ని తయారు చేశారు. తపస్విరెడ్డిని పలువురు అభినందించారు.

బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఇనుప కుర్చీలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం డిపో సిబ్బంది గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం కుర్చీలపై వెల్లకిలా పడుకోబెట్టి ఉన్నట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. వివరాల కోసం 94407 96622 నంబర్‌కి కాల్ చేయాలని ఆయన సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


తాడిపూడిలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న పెండ్యాల అచ్చిబాబు

తాళ్లపూడి: గ్రామంలో బుధవారం జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన ఐదుగురు యువకుల కుటుంబాలను గురువారం ఆంధ్రా షుగర్స్ సీఎండీ పెండ్యాల అచ్చిబాబు పరామర్శించారు. ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఉన్నారు. అలాగే నియోజకవర్గ జనసేన నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, గంటా కృష్ణ తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఆర్థిక సాయం అందజేత

గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నామా కొండబాబు బాధిత కుటుంబాలకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున అందజేశారు.

కార్యక్రమంలో సిద్దన రాధాకృష్ణ, నామా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చోడేశ్వరస్వామి ఆలయంలో వేదసభ


కొవ్వూరు వేద సభలో పాల్గొన్న పండితులు

కొవ్వూరు: పట్టణంలోని పాతూరు ఉమా చోడేశ్వర స్వామి ఆలయంలో వేద శాస్త్ర నిర్వాహక సమితి ఆధ్వర్యంలో గురువారం వేదసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పారాయణ చేశారు. సుమారు 90 మంది క్రమపాఠిలు, ఘనపాఠిలు, శుక్ల యజుర్వేద అవధానులు, స్మార్త అర్చకులు వేద పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో వేద సభ అధ్యక్షుడు కల్లూరి శ్రీకృష్ణ మూర్తి, నోరి భోగేశ్వరశర్మ, శ్రీపాద మణిక్యవధనులు, గండికోట పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.